




# కళ్లలో ఇన్ని రంగులా..!

## కళ్ల రంగు బట్టి మీరెలాంటి వారో తెలుసుకోండి ఇలా

సర్వేంద్రియాణం.. నయనం ప్రధానం అన్నారు పెద్దలు. అంటే మానవుడికి ఉండే అన్ని ఇంద్రియాల్లోకి కళ్లు చాలా ముఖ్యమైనవి. మానవ శరీరంలో అత్యంత సున్నితమైనవి నేత్రాలు. మనుషుల మధ్య ప్రేమానుబంధాలు కళ్లతో మొదలై హృదయాన్ని చేరుకుంటాయని అంటుంటారు. మనిషికి ప్రపంచాన్ని చూపే ఈ కళ్లు ఎంతో ముఖ్యమైనవి. అంతేనా మనలో ఆకర్షణీయంగా కనిపించే అవయవాల్లో కళ్లు మొదటి స్థానంలో ఉంటాయి. అయితే ప్రపంచంలో కేవలం నలుపు రంగు, నీలికళ్లే కాదు ఇంకా చాలా రంగుల కళ్లు ఉన్నాయి..! అవేంటో తెలుసుకుందాం.



**బూడిదరంగు కళ్లు**

సాధారణంగా అందరికీ పుట్టినప్పుడు కళ్లు బూడిదరంగులో ఉంటాయి. కానీ పెరిగే కొద్దీ అవి రంగు మారతాయి. కానీ కొందరికి మాత్రం పెద్దయిన తర్వాత కూడా కళ్లు అదే బూడిదరంగులో ఉంటాయి. ఈ బూడిదరంగు కళ్లు ప్రపంచంలో 3 శాతం మందికి ఉంటాయి. కనుపాప రంగుకు కారణమయ్యే మెలనిన్ అనే వర్ణద్రవ్యం తక్కువ మొత్తం ఉండటం, కంటిలోని స్ట్రోమా భాగంలో కొలాజిన్ ప్రొటీన్ ఎక్కువగా ఉండటంతో కనుపాప నీలిరంగులోకి మారకుండా అడ్డంకి ఏర్పడుతుందట. ఫలితంగా కనుపాప బూడిద రంగులో కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ రంగు కళ్లున్నవాళ్లు ఎక్కువగా ఉత్తర, తూర్పు యూరప్‌లో ఉంటారు. అయితే బూడిద రంగు కళ్లు గల వారిలో హుందాతనం మూర్తీభవించి ఉంటుంది. ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుంటారు. చేయాలనుకున్నదాన్ని చేసుకుంటూ వెళ్లిపోయే రకం. ప్రేమ, రొమాన్స్ తదితరాలకు ఎక్కువ విలువనిస్తారు. మానసికంగా బలంగా ఉంటూ, పరిస్థితులను విశ్లేషించి కష్టకాలం నుంచి నెట్టుకు వచ్చేస్తారు.



**నీలం రంగు కళ్లు**

ప్రపంచంలో 8 నుంచి 10 శాతం మందికి నీలిరంగు కళ్లు ఉంటాయి. యూరప్‌లో అందులోనూ ముఖ్యంగా స్కాండినేవియాలో వీళ్లు అధికం. వీరి కనుపాప రంగు పాక్షికంగా తల్లిదండ్రుల జన్యువు నుంచి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. నీలిరంగు కళ్లున్న వ్యక్తులు చీకటిలోనూ చూడగలరట. అయితే పగటి పూట సూర్యకాంతిని తట్టుకోలేరని నిపుణులు చెబుతున్నారు. అయితే.. నీలి రంగు కళ్లు గల వారు శాంత స్వభావులుగా ఉంటారు. చాలా స్మార్ట్‌గా ఉంటూ ఇతరులను ఆకర్షిస్తారు. వారు దీర్ఘకాల బంధాన్ని కొనసాగిస్తారని నిపుణులు చెబుతున్నారు.

**నలుపు రంగు కళ్లు**

ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది కనుపాపలు నలుపు రంగులో ఉంటాయి. నిజానికి అది నలుపు కాదు.. గోధుమ రంగు. మెలనిన్ అనే వర్ణద్రవ్యం ఎక్కువగా ఉన్నవాళ్ల కళ్లు నలుపుగా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే నల్ల రంగు కళ్లు రహస్యాన్ని సూచిస్తాయని నిపుణులు అంటున్నారు. వీరిది కష్టపడి పని చేసే తత్త్వం. బాధ్యతాయుతంగా ఉండటమే కాదు.. పని ఎంత కష్టమైనా.. చేయడంలో ఒక అడుగు ముందుంటారు. భవిష్యత్తు గురించి ఆలోచించకుండా ప్రెజెంట్‌లో జీవించే వ్యక్తిత్వం వీరిది

**లేత ఆకుపచ్చ కళ్లు**

ప్రపంచ జనాభాలో 2శాతం మంది కళ్లు ఆకుపచ్చ రంగులో ఉంటాయంటా. ఉత్తర, మధ్య, పశ్చిమ యూరప్‌లో ఆకుపచ్చ కళ్లు ఉన్న వ్యక్తులు ఎక్కువ. వీరిలో 16 శాతం సెల్టిక్, జర్మన్ల వారసులై ఉంటారని అంచనా. ఐర్లాండ్, స్కాట్లాండ్‌లో 86 శాతం మంది నీలి, ఆకుపచ్చ రంగు కళ్లున్నవారు ఉన్నారు. ఈ వ్యక్తులు ఇతరులకన్నా ఆకర్షణీయంగా కనిపిస్తారు. అందంలోనే కాదు మేధస్సులోనూ వీరిని ఎవ్వరూ ఓడించలేరు. తమ తెలివితేటలతో ఇతరుల మెప్పు పొందుతారు.

# బంగారు బల్లి విశిష్టత ఇదే..



బంగారు బల్లి అంటే ఎవరికైనా ఇట్టే గుర్తొచ్చేది తమిళనాడులోని కంచి కామాక్షి అమ్మవారి ఆలయం. అక్కడి ఆలయంలో బంగారు తొడుగులతో ఏర్పాటు చేసిన బల్లిని ముట్టుకుంటే దోషం పోయి ఫలితం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఈ విషయం తరచుగా పెద్దలు కూడా చెబుతూ ఉంటారు. అయితే ఈ బంగారు బల్లి గురించి ఒక పురాణగాథ ఉంది. అదేమిటో తెలుసుకుందాం. దీనికి సంబంధించిన పురాణగాథ ప్రకారం.. గౌతమ మహర్షి వద్ద ఇద్దరు శిష్యులు ఉండేవారు. నదీ తీరానికి వెళ్లి నీటిని తీసుకువచ్చే సమయంలో కుండలో బల్లి పడిన విషయాన్ని గుర్తించలేదు. అనంతరం దీన్ని చూసిన గౌతమమహర్షి వారిని బల్లులుగా మారిపొమ్మని శపించాడు. శాపవిముక్తి కోసం వారు ప్రార్థించగా కాంచీపురంలోని వరదరాజపెరుమాళ్ ఆలయంలో లభిస్తుందని చెప్పాడు. దీంతో వారు పెరుమాళ్ ఆలయంలోనే బల్లుల రూపంలో ఉండి స్వామివారిని ప్రార్థించారు.

కొన్నాళ్లకు వారికి శాప విముక్తి కలిగి మోక్షం లభించింది. ఈ సమయంలో సూర్య, చంద్రులు సాక్ష్యంగా ఉన్నారని, శాపవిమోచనం అనంతరం శిష్యులిద్దరి శరీరాలు బంగారు, వెండి బల్లుల రూపంలో బొమ్మలుగా ఉండి భక్తులకు దోషనివారణ చేస్తాయని సూర్య, చంద్రులు చెప్పారు. బంగారు అంటే సూర్యుడు, వెండి అంటే చంద్రుడు అని కూడా అర్థం. అయితే దీనితో పాటుగానే.. సరస్వతీ దేవీ నుంచి శాపవిముక్తి పొందిన ఇంద్రుడు పెరుమాళ్ ఆలయంలో దీనికి గుర్తుగా ఈ బల్లి బొమ్మలను ప్రతిష్టించినట్టు మరో కథనం కూడా ఉంది.

అయితే, ఇటువంటి సూర్యుని తేజస్సుతో ఉండే బంగారు బల్లులు ఒకప్పుడు నిజంగానే ఉండేవి. ఈమధ్య ఇవి అంతరించిపోయాయని , ఎక్కడా కనిపించడంలేదని ఆవేదన చెందుతున్న శాస్త్రవేత్తలకు శేషాచలం కొండల్లో ఇవి చమక్కున మెరిసి కొత్త ఆశలు రేకెత్తించాయి. శేషాచలం ఏడుకొండల్లో ఇవి కనిపించాయి. రాతి గుహలే వీటి ఆవాసం. బంగారు బల్లి శాస్త్రీయ నామం కాలొడాక్టిలోడ్స్ అరీస్. ఇది రాత్రుల్లో సంచరించే నిశాచర జీవి. బంగారు వర్ణం పోలిన ముదురు పసుపు, లేత పసుపు రంగులో మెరిసినట్టు ఉంటుంది.



ఇవి 150 నుంచి 180 మిల్లీ మీటర్ల వరకు పొడవు పెరుగుతాయి. రాతి గుహలు వాటి నివాసానికి అనుకూలం. సూర్యరశ్మి పడని, వేడి తగలని ప్రదేశాల్లో కనిపిస్తాయి. సాధారణంగా చీకటి పడ్డాక గుహల సందుల నుంచి వెలికి వస్తాయి. అనుకూల వాతావరణంలో జనం చడీచప్పుడు లేనప్పుడు ఒక్కోసారి పగటి పూట కూడా బయటకు వస్తాయి. ఇవి 40 నుంచి 50 గుడ్లు పెడతాయి. సాధారణ బల్లుల కంటే గట్టిగా, వింతగా అరుస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.



అయితే ..ఇంట్లో బల్లి తిరుగుతున్నప్పుడు అది మీద పడితే ఎట్లా ? అనే అపోహ అందరికీ ఉంటుంది. అలా పడినపుడు వెంటనే కామాక్షి ఆలయంలోని బల్లిని తలుచుకొని స్నానం చేసి, ఇష్టదైనవాణ్ణి ఆరాదిస్తే దోషం పోతుందంటారు. ఏమోఇంకా దోషం ఉందేమో అనుకునేవారు కంచి అమ్మవారిని దర్శించుకొని బల్లులను తాకుతారు.



